చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తాం..

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, జనవరి 20(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌తో పాటు ఓఆర్ఆర్ పరిధిలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ నిర్ధారణ పూర్తయితే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో 89 ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వచ్చిన ఫిర్యాదులను అక్కడికక్కడే క్షుణ్ణంగా పరిశీలించి గూగుల్ మ్యాప్స్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్సీ ఇమేజీలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి వాస్తవాలేంటంటూ చర్చించారు. గతంలో ఆయా చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఎలా ఉండేవి.. హైడ్రా వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనే అంశాలపై గూగుల్ మ్యాప్స్, ఎన్ఆర్ఎస్సీ ఇమేజిలను పరిశీలించి హైడ్రా తర్వాత పర్మిషన్ లేకుండా వెలసిన నిర్మాణాలను కూల్చేస్తామని రంగనాథ్ తెలిపారు. అమీన్‌పూర్‌లో 193 సర్వే నెంబర్‌లోని తమ స్థలాన్ని వైసీపీ మాజీ ఎమ్మెల్యే మరో వ్యక్తితో కలిసి కబ్జా చేశారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలు, గూగుల్ మ్యాప్స్‌తో సహా అన్ని టెక్నికల్ ఎవిడెన్స్ హైడ్రా కమిషనర్‌కు అందజేశారు. చెరువు ఔట్‌ఫ్లో బయటకు పోకుండా మొత్తం మట్టిపోసి ఎత్తు పెంచారని, దీనివల్ల చెరువు పెద్దగా విస్తరించి రైతులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ అమీన్‌పూర్ చెరువు, అక్కడి ప్రభుత్వ స్థలాల చుట్టూ అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఆ మున్సిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయి సర్వే చేయిస్తామన్నారు. మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనే మేడికుంట చెరువు 45ఎకరాల పరిధిలో ఉండగా క్రమేణా కబ్జాలు జరిగి చెరువు కుంచించుకుపోయిందని, చెరువుకు హద్దులు నిర్ధారించి ప్రజావసరాలకు బఫర్‌జోన్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ పార్కును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.50లక్షలు విడుదల చేసిందని, ఈ మేరకు శిలాఫలకం కూడా వేశారన్నారు. ప్రహరీ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రయత్నిస్తుంటే కబ్జాదారులు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదుదారులు ఇచ్చిన ఆధారాలను పరిశీలించి మూడువారాల్లో పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు.

స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న సీపీలు సీవీ ఆనంద్, సుధీర్‌బాబు

పోలీస్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): క్రీడలు, ఆటలతో శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు పని ఒత్తిళ్లను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ను గోషామహల్ పోలీస్ స్టేడియంలో సోమవారం నగర పోలీస్ కమిషనరేట్ సీవీ ఆనంద్ సమక్షంలో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు సైనా నెహ్వాల్, సి.కశ్యప్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనరేట్‌లో 24 రకాల క్రీడలల్లో 14 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. సిటీ పోలీసింగ్‌లోని అన్ని విభాగాల నుంచి ఈ జట్లలో సభ్యులు పాల్గొంటున్నారని అన్నారు. ఈ సారి టీమ్స్ ఎక్కువగా ఉండడంతో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేనూ స్పోర్ట్స్‌మ్యాన్‌నే

తాను కూడా ఒక స్పోర్ట్స్‌మ్యాన్‌నే అని సీవీ ఆనంద్ చెప్పారు. క్రికెట్‌లో బ్యాటింగ్ చేసేటప్పుడు సెంచరీ చేయాలనే పట్టుదలతో పిచ్‌పైకి దిగుతానని, పరుగు పందెంలో పాల్గొంటే... వంద మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ కొట్టాల్సిందేనన్న పట్టుదలతో ఉంటానని పేర్కొన్నారు. ఆటల్లో ఓడిపోతే తనకు ఆ రాత్రి నిద్ర పట్టదని చెప్పారు. కాగా, ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సైనా నెహ్వాల్, కశ్యప్‌లు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అనేది సంక్లిష్టతలతో కూడిన ఉద్యోగమని, అలాంటి వారికి ఇటువంటి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగద అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాచకొండలో స్పోర్ట్స్ మీట్

రాచకొండ కమిషనరేట్‌లో స్పోర్ట్స్ మీట్ సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ముఖ్య భాగమని, వివిధ రకాల మానసిక శారీరక ఒత్తిళ్లను అధిగమించడానికి క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. రాచకొండ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారని, గరిష్ట శిక్షారేటును సాధిస్తూ గొప్పగా పనిచేస్తున్నారని కొనియాడారు. వారికి విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడులను, వివిధ రకాల సవాళ్ల నుంచి ఉపశమనం పొందేలా, నూతనత్తేజంతో తమ విధి నిర్వహణలో పాల్గొనేలా చేయడానికి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆయన నాగోల్ క్రికెట్ స్టేడియంలో ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్‌మీడియాకు మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి, ఎల్బీనగర్, మల్కాజిగిరి, మహేశ్వరం, క్రైమ్స్, ఎస్ఓటీ, సైబర్‌క్రైమ్, ఉమెన్ సేఫ్టీ డీసీపీలు రాజేశ్ చంద్ర, ప్రవీణ్‌కుమార్, పద్మజ, సునీతారెడ్డి, అరవిందబాబు, మురళీధర్, రమణారెడ్డి, నాగలక్ష్మి, ఉషా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో భాగంగా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీలు బుచ్చయ్య, హరిశ్చంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి

మత్తుకు దూరంగా ఉండాలి

రాజ్‌భవన్ స్కూల్‌లో టీజీన్యాబ్ అవగాహన

ఖైరతాబాద్, జనవరి 20 : మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని తెలంగాణ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో డీఎస్పీలు బుచ్చయ్య,హరిశ్చంద్రారెడ్డి సూచించారు. సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు సేవిస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే 1908కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గోపాల్, టీజీన్యాబ్ ఇన్స్పెక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడొద్దు..

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్ ఫామ్, బైక్ ట్యాక్సీ ప్లామ్స్ నిర్వాహకులతో సోమవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవీస్ సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వేగంగా డెలివరీ చేయాలనే తపనతో గిగ్ వర్కర్లు ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్నారని.. వీటితో ప్రమాదాలు జరుగుతున్నాయని జాయింట్ సీపీ తెలిపారు. ఈ సమావేశంలో మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్‌లో బ్యాటరీ చోరీ

కాచిగూడ, జనవరి 20: ట్రాఫిక్ సిగ్నల్‌లో విలువైన బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఎస్సై సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి బర్కత్‌పుర తెలంగాణ యువతి మండలి సమీపంలో గల ట్రాఫిక్ సిగ్నల్‌లో రూ.18 వేల విలువైన బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. సోమవారం ఉదయం విధులకు హాజరైన సిబ్బంది చూసే సరికి సిగ్నల్‌లో రెండు బ్యాటరీలు కన్పించలేదు. వెంటనే కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

వీడియో కాల్ చేసి... బలవన్మరణం

తిరుపతి(ఫైల్)

దుండిగల్, జనవరి 20 : తాగుడు అలవాటుతో పాటు కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ కారుడ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు భార్యకు వీడియోకాల్ చేసి మరీ తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపి బలవన్మరణానికి పాల్పడ్డాడు.ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ములుగు జిల్లా,గోవిందరావు పేట మండలం,కర్లతండాకు చెందిన బానోతు తిరుపతి(30),శారద దంపతులు. ఏడాది క్రితం ఉపాధికోసం నగరానికి వలసవచ్చారు. నగర శివారు దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని నిరంజన్ కాలనీ వాచ్‌విమెన్‌గా శారద పనిచేస్తూ అక్కడే ఉంటుండగా, తిరుపతి కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తిరుపతికి నిత్యం మద్యంసేవించే అలవాటు ఉండటంతో దంపతుల మధ్యన తరచూ గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం కూడా భార్యభర్తల మధ్యన గొడవ జరగడంతో తిరుపతి బయటకొచ్చాడు. ఒక దుకాణంలో పురుగుల మందును కొనుగోలు చేశాడు. అనంతరం స్థానికంగా ఉన్న బావర్చి హోటల్ సమీపంలోకి వచ్చి తాను పురుగుల మందును తాగుతున్నట్లు భార్యకు తన సెల్‌ఫోన్ నుండి వీడియో కాల్ చేసి చెప్పాడు. వెంటనే ఆందోళనకు గురైన శారద తన భర్త ఆచూకీ వెతుక్కుంటూ బావర్చీ హోటల్ వద్దకు వచ్చిచూడగా హోటల్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో తిరుపతి విగతజీవిగా పడి ఉండటం చూసి గుండెలవిసేలా రోదించింది.అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు శవాన్ని పోస్ట్‌మార్టం కోసం గాంధీవైద్యశాలకు తరలించారు.కేసు దర్యాప్తులో ఉంది.

కరెంట్ షాక్‌తో సెంట్రింగ్ కార్మికుడి మృతి

దుండిగల్,జనవరి 20: నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తున్న సెంట్రింగ్ కార్మికుడు విద్యుత్‌షాక్‌కు గురై మరణించాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన నారాయణ కొడుకు సిద్ధార్థవర్మ(31) రెండేండ్ల క్రితం వలసవచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్నాడు. మల్లంపేట్‌లోని ఆకాశ్ లే అవుట్, రోడ్డు నెంబర్3 లో నిర్మాణంలో ఉన్న ఓ భవనం సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.ఈ క్రమంలో సిద్ధార్థవర్మ సోమవారం సాయంత్రం సదరు భవనంలో మొదటి అంతస్థులో ఇనుపరాడ్ బిగిస్తుండగా అది భవనం పక్కనే ఉన్న విద్యుత్‌వైర్లకు తగిలింది.దీంతో కరెంట్‌షాక్‌కు గురైన సిద్ధార్థవర్మ బిల్డింగ్‌పై నుండి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే తోటి కార్మికులు సిద్ధార్థవర్మను చికిత్సకోసం బాచుపల్లిలోని ఓ వైద్యశాలకు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు దృవీకరించారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భవననిర్మాణదారుడు కార్మికుల భద్రతకు ఎటువంటి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టని కారణంగానే ఈ సంఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆ దొంగలు మన రాష్ట్రంలోనే ఉన్నారా?

గజ్వేల్‌లో ఉండామనుకున్నారు
మార్గమధ్యంలోనే ఆటోదిగి వెళ్లారు
కాల్పుల దొంగల కోసం సాగుతున్న వెతుకులాట

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో కాల్పులు చేసిన దోపిడీ దొంగలు తెలంగాణలోనే ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రధాన పట్టణాలు కాకుండా సాధారణంగా టైర్ 2, 3 పట్టణాలలో కొన్నాళ్లు మకాం వేయాలని అనుకున్నారు. ఇందులో భాగంగానే గజ్వేల్‌లో వెళ్లాలని అక్కడే కొన్ని రోజులు ఉండాలని పథకం పన్నినట్టు పోలీసుల విచారణలో బయటపడింది. గజ్వేల్ వెళ్లేందుకు మాట్లాడుకున్న ఆటో డ్రైవర్‌పై నమ్మకం లేకపోవడంతోనే తిరుమలగిరిలోనే దిగి తమ రూట్ మార్చారని తెలిసి వచ్చింది. మొత్తానికి రోజుకో ట్విస్ట్‌తో దోపిడీ దొంగలు పట్టుబడకుండా నగరపోలీసులకు గట్టి సవాల్ విసిరారు. బీదర్‌లో ఏటీఎం కొల్లగొట్టి హైదరాబాద్‌కు పరారై వచ్చిన ఇద్దరు దుండగులు అఫ్జల్ గంజ్ నుంచి రోశన్ ట్రావెల్స్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ వెళ్లాలని అనుకున్నారు. అయితే ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌కు వారి బ్యాగులపై అనుమానం రావడంతో వెంటనే ఈ విషయాన్ని పసిగట్టిన దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఆ వెనువెంటనే ఇద్దరు దొంగలు అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్‌కు ఆటోలో వెళ్లిపోయారు. తమ రైలు వెళ్లిపోతుందంటూ కంగారుగా ఆటో డ్రైవర్‌పై ఒత్తిడి తెస్తూ సికింద్రాబాద్ వరకు వెళ్లి అక్కడ అల్ఫా హోటల్ వద్ద దిగారు. సికింద్రాబాద్‌లోనే బట్టలు, బ్యాగ్‌లు ఖరీద్ చేసి, అక్కడ హోటల్ గదులు ఇప్పించే బ్రోకర్‌తో మాట్లాడారు. తమకు హోటల్‌లో రూమ్ కావాలంటూ అడగడంతో ఇప్పిస్తామంటూ ఒక వ్యక్తి ముందుకు వచ్చాడు, అయితే తాము గజ్వేల్‌లోని ఒక కంపెనీలో ఉద్యోగం చేయాల్సి ఉందని, అక్కడకు వెళ్లాలని, అక్కడ మీకు పరిచయం ఉంటే మాట్లాడండంటూ కోరారు. దీంతో సదరు దళారీ గజ్వేల్‌తో తెలిసిన వ్యక్తితో రూ. 1500కు ఒక గదిని హోటల్‌లో మాట్లాడుతానంటూ చెప్పడంతో, దుండగులు అక్కడకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో దళారీ ఒక ఆటోను కూడా గజ్వేల్ వరకు మాట్లాడి పంపించాడు. గజ్వేల్‌లో రూమ్స్ మాట్లాడిన వ్యక్తికి, ఆటో డ్రైవర్ ఫోన్ నెంబర్ ఇచ్చాడు. దీంతో ఆటోలో ఇద్దరు దుండగులు తిరుమలగిరి వరకు వెళ్లే వరకు గజ్వేల్ నుంచి దళారీ రెండు సార్లు ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు. దీంతో దుండగులకు అనుమానం వచ్చి తిరుమలగిరిలోనే ఆటోను దిగి, ఆటో డ్రైవర్‌కు రూ. 500 ఇచ్చి అక్కడి నుంచి నడుచుకుంటూ ముందుకు వెళ్లిపోయారు. ఆటో డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత నిర్జన ప్రదేశానికి వెళ్లిన దుండగులు తమ వద్ద ఉన్న డబ్బును కొత్తగా కొనుగోలు చేసిన బ్యాగ్‌లలోకి మార్చి, తమ బట్టలను కూడా మార్చుకున్నారు. అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిపోయారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే సికింద్రాబాద్ నుంచి ఆటోలో వెళ్లిన వ్యక్తిని గుర్తించి విచారించడంతో ఈ కొత్త విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు దుండగులు హైదరాబాద్‌తో పాటు సమీప చిన్న చిన్న పట్టణాలు, కంపెనీలు, కనస్ట్రక్షన్ జరిగే ప్రాంతాలలో దుండగులు బస చేసే అవకాశాలున్నాయని భావిస్తూ ఆ దిశగా గాలింపు చేపట్టారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో బైక్‌ను చోరీ చేసి, బీదర్ వెళ్లి అక్కడ ఏటీఎం డబ్బు దోపిడీ చేసి హైదరాబాద్‌కు తిరిగి పరారయి వచ్చిన బైక్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

మానసిక రుగ్మతలకు ఒత్తిడే కారణం

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ సి.పార్థసారథి
ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో సదస్సు
హాజరైన అల్లం నారాయణ, దేవులపల్లి అమర్

దేవులపల్లి అమర్‌కు అవార్డును అందజేస్తున్న ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోషియేషన్ ప్రతినిధులు, చిత్రంలో అల్లం నారాయణ ఉన్నారు

ఎర్రగడ్డ, జనవరి 20: వివిధ వృత్తులు, ఒత్తిడుల కారణంగా ఎంతో మంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో 'మానసిక ఆరోగ్యం గురించి ప్రజలను చైతన్యవంతం చేయటంలో మీడియా పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్థసారథి మాట్లాడుతూ మానసిక వైద్య నిపుణుల సేవలు నగరంతో పాటు జిల్లాల్లో కూడా అందించాలని కోరారు. మానసిక సమస్యలున్న వారిలో 25 శాతం మంది తమ సమస్యలను ఇతరులతో పంచుకుంటున్నారని మిగితా వాళ్లు ఆ బాధలను దిగమింగుతున్నారని అన్నారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్‌లు మాట్లాడుతూ మానసిక సమస్యలతో బాధ పడుతున్నవాళ్లను రోగులుగా చూడకుండా సరైన సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఇతర డిజిటల్ మీడియాలు సమాజంలో మానసిక సమస్యలతో బాధ పడుతున్నవారికి చక్కని సలహాలు, సూచనలివ్వటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఎండోమెంట్ ఆ రేషన్ అవార్డును దేవులపల్లి అమర్‌కు అందజేసి దేవులపల్లితో పాటు అల్లం నారాయణను శాలువాలతో సన్మానించారు. సెమినార్‌లో ఐఎంహెచ్ హైదరాబాద్ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.కిషన్, కార్యదర్శి రిషి కేష్‌గిరిప్రసాద్, శివ అనూప్, సుధీర్‌రావు, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్, మానసిక వైద్య నిపుణులు వి.జార్జిరెడ్డి, విశ్వాసన్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో నాలుగు రోజుల పాటు సదస్సు..

సైక్రియాట్రిక్ సొసైటీ 76వ వార్షిక జాతీయ సదస్సును ఈ నెల 22 నుంచి 25 వరకు హెచ్ఐసీసీలో నిర్వహించనున్నట్లు ఈ సదస్సుకు ఆర్గనైజింగ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ పి.కిషన్ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి వందలాది మంది మానసిక నిపుణులు ఈ సదస్సుకు హాజరౌతారని వెల్లడించారు. సమాజంలో మానసిక రుగ్మతలను తగ్గించటం ధ్యేయంగా అనుసరించాల్సిన విధానాలు, హాజరైన ప్రతినిధుల సూచనలను పొందుపర్చటమే కాకుండా నిపుణుల విలువైన అభిప్రాయాలను సేకరించటం జరుగుతుందని ఆయన అన్నారు.

సాయం చేసినట్లు నటిస్తారు.. అమాయకులను ముంచేస్తారు

ఏటీఎం కార్డులు తస్కరించే ముఠా అరెస్ట్
రూ.7.50 లక్షల నగదు స్వాధీనం

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ స్నేహమిశ్ర, ఇతర పోలీస్ సిబ్బంది

చార్మినార్, జనవరి 20: సహాయం చేస్తున్నట్లు నమ్మిస్తారు. ఏటీఎంల వద్దకు వచ్చే అమాయకులను టార్గెట్ చేస్తారు. వారికి తెలియకుండానే ఏటీఎం కార్డులు తస్కరించి నగదు కాజేసే ముఠాను దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దక్షిణ మండల డీసీపీ స్నేహమిశ్ర వివరాల ప్రకారం హర్యానాకు చెందిన వకీల్ అలీ (45) నగరానికి వలస వచ్చి చార్మినార్ పరిసర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి హర్యానాకే చెందిన ఇస్లాంతో పాటు యూపీకి చెందిన గుల్లూ ఫర్మాన్ (23), హైదరాబాద్‌కు చెందిన ఒబైద్ ఆరీఫ్ (30)తో పరిచయం ఏర్పడింది. విలాస జీవితానికి అలవాటు పడిన వీరంతా ఓ పథకం రచించారు. ఉదయం, సాయంత్రం ఏటీఎం కేంద్రాలకు వచ్చే వారి దృష్టి మరల్చి వారి వద్ద నుంచి నగదు తస్కరించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో నగదు తీసుకునేందుకు వచ్చే వారికి సహాయం చేస్తున్నట్లు నటించేవారు. అమాయకులను మాటల్లో పెట్టి ఏటీఎం కార్డు, పిన్ నంబర్లను సేకరించేవారు. వీటి ఆధారంగా మరో ప్రాంతానికి వెళ్లి నగదు డ్రా చేసుకొని వాటాలు పంచుకునేవారు. గత నెల బహదూర్‌పురకు చెందిన అతియా ఖాన్ ఏటీఎంకు రాగా ఆమెను నమ్మించిన ముఠా సభ్యులు చాకచక్యంగా ఏటీఎం కార్డును తస్కరించారు. పిన్ నంబర్ తెలుసుకొని నకిలీ కార్డును ఆమె చేతిలో పెట్టి అక్కడ నుంచి పారిపోయారు. అతియా ఖాన్ నుంచి తస్కరించిన కార్డు ద్వారా దశలవారీగా రూ.2 లక్షల మూడు వేల నగదును డ్రా చేయగా ఆమె బహదూర్ పుర పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. అనుమానితులైన వకీల్ అలీ, ఫర్మాన్, ఒబైద్‌అలీని సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి విచారించారని డీసీపీ సేహ మిశ్ర తెలిపారు. మరో ఇద్దరు నిందితులైన గుల్లూ, ఇస్లాం పరారీలో ఉన్నారని వెల్లడించారు. వీరిపై తెలంగాణలో 10 కేసులు, ఆంధ్రప్రదేశ్‌లో 2, ఒడిస్సాలో 4, కర్నాటకలో 2 కేసులు నమోదైనట్లు డీసీపీ స్నేహమిశ్ర తెలిపారు. నిందితుల నుంచి రూ.7. 50లక్షలు, వివిధ బ్యాంకులకు చెందిన 105 కార్డులు, ద్విచక్ర వాహనం, కారు, నకిలీ పోలీస్ ఐడీ కార్డు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్, ఫలక్‌నుమా డివిజన్ ఏసీపీ జావెద్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

IN THE SUPREME COURT OF INDIA EXTRA-ORDINARY APPELLATE JURISDICTION
SPECIAL LEAVE PETITION (CIVIL) No. 8252 OF 2024 WITH PRAYER FOR INTERIM RELIEF
WITH
83607/2024-APPLICATION FOR EXEMPTION FROM FILINGC/C OF THE IMPUGNED JUDGMENT
AND
236910/2024-APPLICATION FOR PERMISSION TO FILE ADDITIONAL DOCUMENTS/FACTS/ANNEXURES
M/S THEME AMBIENCE CONSTRUCTION (P) LTD. ...Petitioners(s)/Appellant(s)
VERSUS
SAJJAN RAJ JAIN AND OTHERS ...Respondent(s)

To,
1. K.DEVA MURTHY, R/O. 4-1-871, MOOSA BUILDINGS,TILAK ROAD, ABIDS, HYDERABAD STATE OF TELANGANA, DISTRICT -TELANGANA — PID: 292086/2024 FOR R(12) IN SLP(C) NO. 8252/2024 (SEC XII-A)
2. M. NAND KISHORE, R/O 16-2-721/K/1, MALAKPET, HYDERABAD STATE OF TELANGANA, DISTRICT-TELANGANA — PID: 292087/2024 FOR R(15) IN SLP(C) NO.8252/2024 (SEC XII-A)
3. M/S. RAGHAVA CO-OPERATIVE HOUSING SOCIETY LTD., REPRESENTED BY ITS SECRETARY D.NO. 10192/3/69 B, AMPRO COLONY, STREET NO. 21, SAROOR NAGAR, HYDERABAD STATE OF TELANGANA, DISTRICT-TELANGANA — PID: 292088/2024 FOR R(19) IN SLP(C) NO. 8252/2024 (SEC XII-A)

WHEREAS the Petition for Special Leave to Appeal with prayer for interim relief along with application for **EXEMPTION FROM FILING C/C OF THE IMPUGNED JUDGMENT, PERMISSION TO FILE ADDITIONAL DOCUMENTS/FACTS/ANNEXURES,** above mentioned (copy enclosed) filed in the Registry by Mr. HIMINDER LAL, Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearinhg before this court on **17th December, 2024** when the Court was pleased to pass the following order:-

1. I.A. No. 248591/2024 in SLP (C) No.(s). 8252/2024- Application seeking service of notice by way of publication in respect of unserved respondent Nos. 12, 15 & 19 is allowed.
2. In SLP (C) No. 25280/2024, service is incomplete on respondent nos. 7,9,10,12,15 & 17. Petitioner shall take necessary steps to serve the unserved respondents.
3. In the meantime, counter affidavit be filed
4. Interim order shall continue to operate.
5. List after completion of service.

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition with prayer for interim relief along with application for **EXEMPTION FROM FILING C/C OF THE IMPUGNED JUDGMENT, PERMISSION TO FILE ADDITIONAL DOCUMENTS/FACTS/ ANNEXURES** will be posted for hearing before this Court in due course and you may enter appearance before this Court either in person or through an advocate on record of this Court duly appointed by you in that behalf within 30 days from the date of service of notice. You may thereafter show cause to the Court on the day that may subsequently be specified as to why Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal be not allowed.

Take Further Notice that the